# భారత్‌కు ఉత్కంఠ విజయం

**గెలుపు ముంగిట తడబడ్డ దక్షిణాఫ్రికా ● స్నేహ్ రాణాకు ఐదు వికెట్లు**



స్నేహ్ రాణా (5/43)

కొలంబో: సీనియర్ స్పిన్నర్ స్నేహ్ రాణా (5/43) మరోసారి బంతితో మాయ చేయడంతో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలో భారత మహిళల జట్టు ఉత్కంఠ విజయం సాధించింది. కొలంబోలోని ప్రేమదాస వేదికగా జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో భాగంగా.. మంగళవారం సౌతాఫ్రికాతో జరిగిన పోరులో టీమ్‌ఇండియా 15 పరుగుల తేడాతో గెలుపొంది వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. భారత్ నిర్దేశించిన 277 పరుగుల ఛేదనలో సౌతాఫ్రికా ఒకదశలో 41 ఓవర్లలో 206/3తో లక్ష్యం దిశగా సాఫీగా సాగిపోయింది. టాజ్మిన్ బ్రిట్స్ (109), ఆ జట్టు సారథి లారా వోల్వార్డ్ట (43) తొలి వికెట్‌కు 140 పరుగులు జోడించినా ఈ ఇద్దరూ క్రీజును విడవడంతో దక్షిణాఫ్రికా తడబడింది. స్నేహ్ రాణా తో పాటు భారత ఫీల్డర్ల మెరుపు రనౌట్లతో సఫారీలు 49.2 ఓవర్లలో 261 రన్స్ వద్దే కుప్పకూలారు. సెంచరీ తర్వాత రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన టాజ్మిన్.. ఆఖర్లో తిరిగి క్రీజులోకి వచ్చినా ఆ జట్టు పరాభవాన్ని తప్పించలేకపోయింది. తన చివరి ఓవర్ (ఇన్నింగ్స్ 48వ) వేసిన రాణా.. మూడు కీలక వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికాను దెబ్బకొట్టింది. వన్డేలలో ఆమెకు ఇదే తొలి ఫైఫర్. ఈ సిరీస్‌లో శ్రీలంకతో జరిగిన తొలి మ్యాచ్‌లోనూ రాణా భారత విజయంలో కీలకపాత్ర పోషించిన విషయం విదితమే. ఇక మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 276 రన్స్ చేసింది. యువ ఓపెనర్ ప్రతీక రావల్ (78) వన్డేలలో వరుసగా ఐదో ఫిఫ్టీ ప్లస్ స్కోరు నమోదు చేయగా హర్మన్‌ప్రీత్ (41), జెమీమా (41), స్మృతి మంధాన (36) రాణించారు.

## వెల్‌డన్ వైభవ్

**మాజీ మంత్రి కేటీఆర్ ప్రశంస**



హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): చిన్న పిల్లాడే అయినా క్రికెట్‌లో చిచ్చరపిడుగులా రెచ్చిపోతున్నాడని యంగ్ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసించారు. 14 ఏండ్ల వయస్సులోనే క్రికెట్‌లో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నాడని ప్రత్యేకంగా అభినందించారు. కేవలం 35 బంతుల్లోనే సెంచరీ కొట్టాడని, ఎలాంటి భయం లేకుండా ఆడుతున్న అతడి అద్భుత ప్రతిభకు ముచ్చటేస్తున్నదని తెలిపారు. మొదటి ఐపీఎల్‌లోనే వైభవ్ ఇంత మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తే.. మున్ముందు అతడి బ్యాటు నుంచి ఇలాంటి సెంచరీలు చాలా చూడవచ్చని పేర్కొన్నారు. అభినందనలు యంగ్‌మ్యాన్.. అని ఎక్స్ వేదికగా కేటీఆర్ ప్రశంసించారు.

## వైభవ్‌కు నజరానా

పాట్నా: ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆటకు స్టేడియంలో ప్రేక్షకులు, టీవీల ముందు మ్యాచ్‌ను వీక్షించిన కోటానుకోట్ల క్రికెట్ అభిమానులే కాదు.. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సైతం ఫిదా అయ్యారు. నిండా 15 ఏండ్లు కూడా నిండని వైభవ్.. సోమవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 35 బంతుల్లోనే రికార్డు శతకం సాధించి ఐపీఎల్‌లో కొత్త చరిత్ర లిఖించాడు. ఈ నేపథ్యంలో నితీశ్ కుమార్.. రాష్ట్రప్రభుత్వం తరపున వైభవ్‌కు రూ.10 లక్షల నగదు బహుమానం ప్రకటించారు.

# రేసులో రైడర్స్

**ఢిల్లీపై కోల్‌కతా ఉత్కంఠ విజయం**

**రాణించిన రఘువంశీ, రింకూ**

**నరైన్, వరుణ్ విజృంభణ**



రఘువంశీ (44)

రింకూసింగ్ (36)

ఢిల్లీ: ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ 14 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతాకు బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. అంగ్‌క్రిష్ రఘువంశీ (32 బంతుల్లో 44, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రింకూ సింగ్ (25 బంతుల్లో 36, 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఆ తర్వాత ఛేదనకు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 190/9 పరిమితమైంది. డుప్లెసిస్(62), అక్షర్‌పటేల్(43)రాణించారు. నరైన్(3/29), వరుణ్ చక్రవర్తి(2/39)..ఢిల్లీ పతనాన్ని శాసించారు.

**ఢిల్లీ ధమాల్:**

భారీ ఛేదనలో ఢిల్లీకి ఇన్నింగ్స్ రెండో బంతికే షాక్ తగిలింది. అనుకుల్ బౌలింగ్‌లో పొరెల్ (4) మిడాఫ్ వద్ద రసెల్ చేతికి చిక్కాడు. కరుణ్ నాయర్ (15), కేఎల్ రాహుల్ (7) కూడా నిరాశపరిచారు. కానీ డుప్లెసిస్ ధాటిగా ఆడాడు. మూడు బౌండరీలతో హర్షిత్‌కు స్వాగతం పలికిన డుప్లెసిస్.. వరుణ్ 8వ ఓవర్లో 4, 4, 6 దంచాడు. డుప్లెసిస్‌కు అక్షర్ జతకలవడంతో ఢిల్లీ స్కోరు వేగం ఊపందుకుంది. 31 బంతుల్లో అర్ధశతకం పూర్తిచేసుకున్న డుప్లెసిస్.. అదే జోరును కొనసాగించాడు. వీలుచిక్కినప్పుడల్లా బంతిని బౌండరీ లైన్ దాటించిన ఈ ద్వయం ఓవర్‌కు పది పరుగులకు తగ్గకుండా ఆడింది. 42 బంతుల్లోనే 76 పరుగులు జోడించి ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని నరైన్ 14వ ఓవర్లో విడదీశాడు. ఒకే ఓవర్లో అక్షర్‌తో పాటు స్టబ్స్(1)ను ఔట్ చేసి కోల్‌కతాను పోటీలోకి తీసుకొచ్చాడు. అప్పటి వరకు లక్ష్యం వైపు సాఫీగా సాగిన ఢిల్లీని డుప్లెసిస్‌ను ఔట్ చేయడం నరైన్ మళ్లీ దెబ్బకొట్టాడు. ఈసారి తన వంతు అన్నట్లు వరుణ్ 18వ ఓవర్‌లో వరుస బంతుల్లో అశుతోష్(7), స్టార్క్(0)ను ఔట్ చేసి కోల్‌కతా విజయానికి బాటలు వేశాడు. ఆఖర్లో విప్రాజ్ నిగమ్(38) ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది.

**కోల్‌కతా దూకుడు**

మొదట టాస్ ఓడి బ్యాటింగ్‌కు వచ్చిన కోల్‌కతా ఇన్నింగ్స్ ఆసాంతం దూకుడు మంత్రాన్ని జపించింది. ఢిల్లీ ఎదుట భారీ లక్ష్యాన్ని నిర్దేశించాలనే పక్కా ప్రణాళికతో బరిలోకి దిగిన ఆ జట్టు.. ఆరంభం నుంచే ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడింది. ఆ జట్టులో ఒక్క బ్యాటర్ కూడా అర్ధశతకం సాధించకపోయినా ప్రత్యర్థి ఎదుట 205 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించడం విశేషం. ఓపెనింగ్ జోడీ గుర్బాజ్ (12 బంతుల్లో 26, 5 ఫోర్లు, 1 సిక్స్), నరైన్ (16 బంతుల్లో 27, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) క్రీజులో ఉన్నది కొద్దిసేపే అయినా మెరుపులు మెరిపించి 3 ఓవర్లకే 48 రన్స్ జోడించారు. రెండో ఓవర్ వేసిన చమీర బౌలింగ్‌లో నరైన్ 6, 4, 6 బాదగా గుర్బాజ్ ఓ ఫోర్ కొట్టడంతో మొత్తంగా 25 పరుగులొచ్చాయి. స్టార్క్ మూడో ఓవర్లో 4, 4, 6తో రెచ్చిపోయిన గుర్బాజ్.. వికెట్ల వెనుకాల పొరెల్ డైవింగ్ క్యాచ్‌తో ఔట్ అయ్యాడు. రహానే వచ్చీ రాగానే స్టార్క్ బౌలింగ్‌లో 6, 4తో పాటు ముకేశ్ బౌలింగ్‌లో రెండు బౌండరీలు దంచేయడంతో పవర్ ప్లేలో కోల్‌కతా 79/1గా నిలచింది. కానీ నాలుగు బంతుల వ్యవధిలో నరైన్, రహానే పెవిలియన్ చేరారు. వెంకటేశ్ అయ్యర్ (7) మళ్లీ విఫలమైనా రఘువంశీతో జతకలిసిన రింకూ.. స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. విప్రాజ్ బౌలింగ్‌లో రఘువంశీ రెండు సిక్సర్లు బాదగా 15వ ఓవర్లో రింకూ రెండు బౌండరీలు, ఓ సిక్స్‌తో కుల్‌దీప్‌ను శిక్షించాడు. ఐదో వికెట్‌కు 61 రన్స్ జోడించిన ఈ జోడీ కూడా వెంటవెంటనే పెవిలియన్‌కు చేరింది. ఆఖర్లో రసెల్ మెరుపులు మెరిపించాడు.

### సంక్షిప్త స్కోర్లు

**కోల్‌కతా:** 20 ఓవర్లలో 204/9 (రఘువంశీ 44, రింకూ 36, స్టార్క్ 3/43, అక్షర్ 2/27); **ఢిల్లీ:** 20 ఓవర్లలో 190/9(డుప్లెసిస్ 62, అక్షర్ 43, నరైన్ 3/29, వరుణ్ 2/39)

### పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| బెంగళూరు | 10 | 7 | 3 | 0 | 14 | 0.52 |
| ముంబై | 10 | 6 | 4 | 0 | 12 | 0.88 |
| గుజరాత్ | 9 | 6 | 3 | 0 | 12 | 0.74 |
| ఢిల్లీ | 10 | 6 | 4 | 0 | 12 | 0.36 |
| పంజాబ్ | 9 | 5 | 3 | 1 | 11 | 0.17 |
| లక్నో | 10 | 5 | 5 | 0 | 10 | -0.03 |
| కోల్‌కతా | 10 | 4 | 5 | 1 | 9 | 0.27 |
| రాజస్థాన్ | 10 | 3 | 7 | 0 | 6 | -0.34 |
| హైదరాబాద్ | 9 | 3 | 6 | 0 | 6 | -1.10 |
| చెన్నై | 9 | 2 | 7 | 0 | 4 | -1.30 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్



## రేపటి నుంచి సాట్స్ సమ్మర్ కోచింగ్

**33 జిల్లాల్లో క్యాంప్‌లు**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ(సాట్స్) సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లకు వేళయైంది. మే 1 నుంచి జూన్ 6వ తేదీ వరకు జంట నగరాలు సహా 33 జిల్లాల్లో శిక్షణాశిబిరాలు కొనసాగనున్నాయి. ఈ మేరకు సమ్మర్ కోచింగ్ క్యాంప్‌నకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి, సాట్స్ ఎండీ సోనీబాలదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో శివసేనారెడ్డి మాట్లాడుతూ 'ముఖ్యంగా విద్యార్థులు, యువత ఎక్కువ సంఖ్యలో పాల్గొనే విధంగా సాట్స్ ఏర్పాట్లు చేసింది. కోచింగ్ క్యాంప్‌ల్లో విద్యార్థులనే కాకుండా వారి తల్లిదండ్రులను భాగం చేసేందుకు ఉచితంగా యోగా, జుంబా డ్యాన్స్ శిక్షణ ఇవ్వబోతున్నాం. జిల్లా కేంద్రాలకే పరిమితం కాకుండా ఈసారి ఎంపిక చేసిన పట్టణాల్లో కూడా క్యాంప్‌లు ప్రారంభిస్తున్నాం. వేసవి శిక్షణాశిబిరాల కోసం విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, వాటిని భవిష్యత్ అవసరాల కోసం వినియోగించుకుంటాం' అని పేర్కొన్నారు.

## ఇంగ్లండ్ సారథిగా నటాలి సీవర్



లండన్: ఇంగ్లండ్ మహిళా క్రికెట్ జట్టు సారథిగా ఆల్‌రౌండర్ నటాలి సీవర్ బ్రంట్ నియమితురాలైంది. ఈ మేరకు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) తన సోషల్‌మీడియా ఖాతాల ద్వారా ఈ విషయాన్ని వెల్లడించింది. 9 ఏండ్ల పాటు ఇంగ్లండ్‌ను నడిపించినా.. ఈ ఏడాది మహిళల యాషెస్ సిరీస్‌లో ఇంగ్లీష్ జట్టు అవమానకర ఓటములతో సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న హీథర్ నైట్ స్థానాన్ని సీవర్ భర్తీ చేయనుంది. మూడు ఫార్మాట్లలోనూ ఆమె ఇంగ్లండ్‌కు సారథిగా వ్యవహరించనుంది.

# ముగిసిన భారత్ పోరు

**సుదిర్మన్ కప్ ఫైనల్స్**

గ్జియామెన్ (చైనా): ప్రతిష్టాత్మక బీడబ్ల్యూఎఫ్ సుదిర్మన్ కప్ ఫైనల్స్‌లో భారత్ పోరాటం గ్రూప్ దశలోనే ముగిసింది. ఈ టోర్నీలో క్వార్టర్స్ ఆశలను సజీవంగా నిలుపుకోవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్.. 1-4తో ఇండోనేషియా చేతిలో ఓటమిపాలైంది. గ్రూప్-డీలో భాగంగా డెన్మార్క్‌తో మంగళవారం జరిగిన మొదటి మ్యాచ్‌లో ఓడిన భారత షట్లర్లు.. ఇండోనేషియాతోనూ అదే వైఫల్యాలను కొనసాగించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో ద్వయం 10-21, 21-18, 21-19తో రెహాన్-గ్లోరియాతో జరిగిన హోరాహోరీ పోరులో గెలిచి భారత్‌కు 1-0 ఆధిక్యం ఇచ్చారు. కానీ తర్వాత జరిగిన 4 గేమ్‌లలో భారత షట్లర్లు ఒక్క మ్యాచ్ కూడా గెలుచుకోలేదు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు 12-21, 13-21తో వర్దాని చేతిలో ఓడగా పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్.. 21-19, 14-21, 12-21తో జొనాథన్ క్రిస్టీ జోరుకు తలవంచాడు. మహిళల డబుల్స్‌లో ప్రియా-మిశ్రా జంట 10-21, 9-21తో మయసరి-రమధంతి చేతిలో ఓటమి పాలైంది. పురుషుల డబుల్స్‌లో హరి హరన్-రుబాన్.. 20-22, 18-21తో ఫిక్రీ-మార్టిన్ ద్వయం జోరు ముందు నిలువలేకపోయింది.



# అజారుద్దీన్‌కు ఊరట

**నార్త్‌స్టాండ్ పేరు తొలిగింపుపై చర్యలు వద్దన్న హైకోర్టు**



హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలోని నార్త్‌స్టాండ్‌కు ఉన్న అజారుద్దీన్ పేరును తొలిగించవద్దని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)కు హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని ఆదేశాలు ఇస్తూ, తదుపరి విచారణ వాయిదా వేసింది. స్టేడియంలోని నార్త్ స్టాండ్‌కున్న అజారుద్దీన్ పేరును తొలిగించాలని హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్ జస్టిస్ వంగ ఈశ్వరయ్య ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. తన పేరును తొలిగించడాన్ని సవాల్ చేస్తూ భారత మాజీ కెప్టెన్ అజారుద్దీన్ దాఖలు చేసిన పిటీషన్‌ను జస్టిస్ పల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. పిటీషనర్ పదేళ్ల పాటు భారత జట్టుకు కెప్టెన్‌గా, రెండు దశాబ్దాల పాటు క్రికెటర్‌గా దేశం తరపున సేవలందించినట్లు న్యాయవాది చెప్పారు. అంబుడ్స్‌మన్ ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరారు. వాదనల తర్వాత న్యాయమూర్తి తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు నార్త్‌స్టాండ్ పేరు తొలిగింపు విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టవద్దని హెచ్‌సీఏను ఆదేశించారు.




The new Tiguan R-Line
Beyond betteR

2.0l TSI with 4MOTION | 26.04 cm Digital Cockpit Pro | 9 Airbags as standard | DCC Pro with Driving Mode selection
Infotainment System with 38.1 cm display | Level 2 ADAS with 21 features | Head-up display | IDA Voice Assistant

4EVER CARE** 4 year Standard Warranty 4 year Road Side Assistance 3 Free Services
Exchange through Certified Pre-Owned
Call 1800 102 0909
volkswagen.co.in

*Price mentioned is ex-showroom introductory price. Terms and conditions apply. Images are for representation purpose. Features and accessories shown may not be a part of standard equipment and are subject to change without prior notice. Actual colour of the car may vary. The dark shade on the glass is due to the lighting effect. **3 Free services applicable on 1 000 km, 7 500 km and 15 000 km. Only labour charges are free with servicing. To know more visit your nearest dealership.

**Authorised Dealers: Volkswagen Hitec City:** 8588821702; **Volkswagen Hitech city (Kukkatpally):** 7799996272; **Volkswagen Deccan (L B Nagar):** 9160680000; **Volkswagen Hyderabad (Banjara Hills):** 9121391213; **Volkswagen Hyderabad (Gachibowli):** 8588821702; **Volkswagen Himayatnagar:** 9160680000; **Volkswagen Mehdipatnam:** 9160680000; **Volkswagen Secunderabad:** 9873484014; **Volkswagen Somajiguda:** 9873484014; **Volkswagen SP Road:** 9121391213; **Volkswagen Visakhapatnam:** 9160680000; **Volkswagen Vijayawada:** (0866) 2454524, 8886691748; **Volkswagen Guntur:** (0863) 2330001, 7799711129; **Volkswagen Tirupati:** 8929478576; **Volkswagen Nellore:** 7799711102; **Volkswagen Karimnagar:** 8929482330; **Volkswagen Warangal:** 8929482330; **Volkswagen Khammam:** 8929482330; **Volkswagen Bhimavaram:** 8886691749; **Volkswagen Ongole:** 7799711125; **Volkswagen Ananthapur:** 8929478576; **Volkswagen Rajahmundry:** 9160680000; **Volkswagen Kurnool**- 8929478576.
**Volkswagen Mahbubnagar** - 8247713110; **Volkswagen Nizamabad** - 8929482330.